# కరణేషు మంత్రీ

చిలకలపూడి సత్యనారాయణ

"అది కాదురా! అమ్మాయి నచ్చిందని చెప్పి, ఇప్పుడు నచ్చలేదని చెబితే ఎలారా? అమ్మాయి నచ్చిందని ఒకసారి, నచ్చలేదని ఒకసారి వాళ్లకు కబురు పెడితే ... ఆ అమ్మాయి ఎంత బాధపడుతుందో ఆలోచించరా!" ఆడపిల్ల మనసు గురించి తెలుసున్న తల్లి కొడుకు కిషోర్‌ని అడిగింది.

"నే నేదో తాంబూలాలు పుచ్చుకున్న తరువాత ఆ అమ్మాయి నచ్చలేదని చెప్పినట్టు బాధపడతా రేమిటి? ఆ అమ్మాయిని చూసొచ్చి పది రోజులే అయింది. ఇంకా వాళ్లెవరూ మనింటికి రాలేదు. అందుకే చెబుతున్నాను, వాళ్లు మనింటికి రాకముందే అమ్మాయి నచ్చలేదని వాళ్లకు కబురు పంపించండి!" ఏసుగ్గా చెప్పాడు కిషోర్.

"స్టాప్ టాకింగ్ నాన్‌సెన్స్ కిషోర్! అమ్మాయి నచ్చలేదని చెప్పటం మేము తప్పు అనటంలేదు. కానీ పెళ్లి చూపులకు వెళ్లి వచ్చిన వెంటనే 'నాకు అమ్మాయి నచ్చింది' అని చెప్పావు. నేను వెంటనే ఆ విషయం వాళ్లకు కబురు చేశాను. ఇప్పుడు ఆ అమ్మాయి నచ్చలేదంటున్నావ్! మా అబ్బాయికి మీ అమ్మాయి నచ్చలేదని ఇప్పు డెలా వాళ్లకు కబురుపెట్టను? ఈ ఏడుపేదో ఆ రోజే ఏడ్చుంటే అప్పుడే ఆ విషయం వాళ్లకు చెప్పేవాడిని. మనం ఇలా ఆర్గ్యుమెంట్స్ చేసుకునే పరిస్థితి వచ్చేది కాదు, కిషోర్!" మందలించాడు కిషోర్ తండ్రి.

"ఎంతసేపూ వాళ్ల మనసులు బాధపడతాయని చూస్తారే తప్ప, నా ఇష్టాన్ని గురించి ఆలోచించరా! ఒకసారి నచ్చిందని చెప్పినంత మాత్రాన ఆ మాట మీదే నిలబడాలా? ఇంకో టింకో్టైతే వరవాలేదు. ఇది నా సమస్య!" చెప్పాడు కిషోర్.

"సిల్లీగా మాట్లాడకు, కిశోర్! నిన్ను మే మడిగేది ఒకటే! ఆ రోజు అమ్మాయి నచ్చిందని చెప్పావు. ఈ రోజు నచ్చలేదు అంటున్నావు. అదే ఎందుకూ అని అడుగుతున్నాను!" కొడుకుని నిలదీశాడు తండ్రి.

"ఏమో నాకు తెలియదు. ఆ అమ్మాయి నాకు నచ్చలేదు, అంతే!"

"అది కాదు, కిశోర్! ..." తల్లి ఏదో చెప్పబోయింది.

"డోన్ట్ కన్విన్స్ మీ మమ్మీ!" అడ్డువడ్డాడు కిషోర్.

"ఇది మంచి పద్ధతి కాదు!" కోపంగా అన్నాడు తండ్రి.

"సరే, నాన్నా! ఇష్టం లేని అమ్మాయితోనే కాపురం చేయాలని మీరంటే మీ ఇష్టం వచ్చినట్టు చేసుకోండి!" కోపంగా చెప్పేసి వెళ్లిపోయాడు కిశోర్.

చేసేది లేక, "ఇక ఈ విషయం వదిలేయండి" అంటూ ఒక ఉత్తరం ముక్క రాశాడు కిషోర్ తండ్రి.

** ** **

ఆఫీసులో కిటికీ పక్కన కూర్చుని ఆఫీసు పని చూసుకుంటున్న కిషోర్, ఆఫీసు గేటు తెరుచుకునే శబ్దం వినబడేటప్పటికి తల తిప్పి కిటికీలో నుంచి బయటకు చూశాడు.

గేటు తెరుచుకుని ఎవరో అమ్మాయి లోపలికి వస్తోంది.

తదేకంగా ఆ అమ్మాయినే చూశాడు కిషోర్.

గతుక్కుమన్నాడు.

"ఇ దెందుకు నా ఆఫీసుకు వస్తోంది? నన్ను చూడటానికేనా? ఎందుకు నన్ను చూడాలి?" కిశోర్ బుర్ర అతన్ని తినసాగింది.

ఆ అమ్మాయిని చూడటానికే పది రోజుల కిందట కిశోర్ పెళ్లి చూపులకు వెళ్లాడు. మొదట నచ్చిందని, తరువాత నచ్చలేదని చెప్పాడు.

'ఎందుకు వస్తున్నట్లో' గాభరా పడ్డాడు కిశోర్.

ఆ అమ్మాయి ఆఫీసులోకి ప్రవేశించడంతో చూపులు మరల్చుకున్నాడు కిశోర్.

అతనిలో గాభరా, భయం ఎక్కువయ్యాయి.

ఆఫీసు బోయ్‌ని పిలిచి, మంచినీళ్లు తెమ్మన్నాడు.

క్షణం తరువాత ఆఫీసు బాయ్ గ్లాసుతో మంచినీళ్లు తీసుకొచ్చి, కిశోర్ టేబుల్ మీద పెట్టి, "సార్! మిమ్మల్ని చూడటానికి ఎవరో వచ్చారుట! రిసెప్షన్‌లో ఉన్నారట!" చెప్పి, వెళ్లిపోయాడు.

గ్లాసుడు మంచినీళ్లను గబగబా ఒక్క గుక్కలో తాగేసి, మొహానికి పట్టిన చెమటను కర్చీఫ్‌తో తుడుచుకుని, రెండు నిముషాలు ఆలోచించుకుని, ధైర్యం పుంజుకున్నవాడిలా తల విదిలించి సీటులో నుంచి పైకి లేచాడు.

మెల్లగా నడుచుకుంటూ రిసెప్షన్‌లోకి అడుగు పెట్టాడు.

"హలో!" అన్నది ఆ అమ్మాయి.

"హలో!" అన్నాడు కిశోర్ తడబడుతూ తప్పనిసరిగా.

"మీతో కొంచెం మాట్లాడాలి!" చెప్పిం దా అమ్మాయి.

"నాతో మాట్లాడాల్సింది ఏముంది?" అడిగాడు కిశోర్.

"లేదు, మీతోనే మాట్లాడాలి. మీ ఆఫీసు కేంటీన్‌లోకి వెళ్లి మాట్లాడుకుందాం!" అంటూ, ఆఫీసు కేంటీన్ వైపు దారితీసింది చొరవగా.

ఆమె వెనుకే నడిచాడు కిశోర్ అప్రయత్నంగా.

ఇద్దరూ కేంటీన్‌లోకి అడుగు పెట్టారు.

"అదిగో, అక్కడ ఖాళీగా ఉంది, ఆ టేబుల్ దగ్గర కూర్చుందాం!" చెప్పి, అటు నడిచింది ఆ అమ్మాయి.

మౌనంగా ఆమెను అనుసరించాడు కిశోర్.

ఇద్దరూ కూర్చున్నారు.

"ఇప్పుడు చెప్పండి, నేను నచ్చలేదని చెప్పారుట!" సూటిగా అడిగింది ఆ అమ్మాయి.

"అ...వు...ను...!" తల వంచుకుని సమాధానం చెప్పాడు కిశోర్.

"ఎందుకు నేను మీకు నచ్చలేదో చెప్తారా?" నిలదీసింది.

కిశోర్‌కి కోపం వచ్చింది.

"అది చెప్పాల్సిన అవసరం నాకు లేదు" చెప్పాడు కిశోర్.

"తెలుసుకోవలసిన అవసరం నాకుంది!"

"ఐ యామ్ సారీ! నే నేం చెప్పదలుచుకోలేదు."

"క్షమించండి! ఇలా మీ ఆఫీసుకు వచ్చి మిమ్మల్ని నిలదీయటం నా ఉద్దేశం కాదు. అది తప్పు కూడా! కానీ మొదట నచ్చాననీ, తరువాత నచ్చలేదనీ చెప్పటం నా మనసుని కష్టపెట్టింది. అందుకే నే నెందుకు మీకు నచ్చలేదో అడిగి తెలుసుకుందా మని వచ్చాను. పెళ్లికాని ఆడపిల్ల ఇలా ఇల్లు దాటి బయటకు వచ్చి పెళ్లి చూపులకు వచ్చి చూసి వెళ్లినతన్ని కలుసుకోవడం తప్పే! కానీ, మనసుని చంపుకోలేం కదండీ! అందుకే నేను మీకు ఎందుకు నచ్చలేదో చెబితే, తెలుసుకుని వెళ్లిపోవాలని వచ్చాను."

సమాధానం చెప్పకుండా కిశోర్ మౌనంగా కూర్చున్నాడు.

"నా కేం తక్కువ చెప్పండి! అందముంది, చదువుంది, ఉద్యోగం ఉంది, సంపాదన ఉంది ... మీ రడిగిన కట్నం కూడా ఇచ్చుకునే స్తోమత ఉంది ..." మళ్లీ ఆ అమ్మాయే మాట్లాడింది.

ఒకపక్క ఆ అమ్మాయి ధైర్యం, చొరవ కిశోర్‌కి నచ్చినా, ఏమీ మాట్లాడలేకపోయాడు.

"చూడండి, కిశోర్ గారూ! మిమ్మల్ని బలవంతం చేయను. అమ్మాయి నచ్చిం దనటం, నచ్చలేదనటం మగవారి ఇష్టానుసారం. ఆ స్వాతంత్ర్యాన్ని నేను తప్పనటంలేదు. కానీ అమ్మాయి కూడా మీలాగే మానవజాతికి చెందినదనీ, మీకుమల్లే అమ్మాయిలకి కూడా మనసుంటుందనీ మీరు ... ఐ మీన్ మీ మగవాళ్లు మరిచిపోతున్నారు. పెళ్లి చూపులకు రావటం, అమ్మాయిని చూడటం, నచ్చిందనో, నచ్చలేదనో చెప్పటం ... అఫ్‌కోర్స్! అది మన సంప్రదాయం, పద్ధతి. దాన్ని కూడా నేను తప్పు పట్టడంలేదు. చూసిన రోజు నచ్చిందనటం తరువాత నచ్చలే దనటం - ఇదే నా మనోవేదనకు కారణం. నన్ను చూసి వెళ్లిన రోజే నేను నచ్చలేదని చెప్పి ఉంటే, నే నంతగా బాధపడేదాన్ని కాదు. ఇప్పటికి నలుగురు చూసి వెళ్లారు, మీరు అయిదోవారు అనుకునేదాన్ని. కానీ మీరు మొదట నచ్చా నని, తరువాత నచ్చలేదని చెప్పటం నా భవిష్యత్తుని దెబ్బతీసింది!". చెప్పటం ఆపి, కిశోర్ మొహంలోకి చూసింది.

అతను మొహం ప్రశ్నార్థకంగా పెట్టాడు.

"ఎస్! నా భవిష్యత్తుని దెబ్బతీసింది. ఎలా అని ఆలోచిస్తున్నారా! మీరు పెళ్లి చూపులకు వచ్చి చూసి వెళ్లిన రెండవరోజు మాకు తెలునున్న ఒకావిడ నాకు నంబంధం తెచ్చింది. నా తల్లిదండ్రులు గర్వంగా, ఆనందంగా 'మా అమ్మాయికి పెళ్లి నంబంధం కుదిరింది. మొన్న చూసి వెళ్లారు. అమ్మాయి నచ్చిందనే కబురు కూడా వచ్చేసింది' అని చెప్పారు. ఆవిడ వెళ్లిపోయింది. నిన్న మీ నాన్నగారు రాసిన కార్డు అందింది. మొదట ఆశ్చర్యపోయిన నా తల్లిదండ్రులు తేరుకుని తమ బాధను అణచుకుని, తమ కర్తవ్యాన్ని గుర్తుకు తెచ్చుకుని 'ఆ' మాకు తెలునున్న ఆవిడ దగ్గరకు వెళ్లారు - ఆవిడ తెచ్చిన నంబంధం గురించి తెలునుకోవటానికి. 'పెళ్లి నంబంధం కుదిరిందన్నారుగా' అని అడిగిన ఆవిడకు తెలియక నిజం చెప్పారు. అంతే! నాలో ఏదో లోపం ఉండబట్టే నచ్చిందని కబురు చేసిన వాళ్లు నచ్చలేదని కబురు చేశారని అందరూ అనుకోసాగారు. ఈ అవమానాన్ని తీర్చుకోవాలనే ఉద్దేశంతో నేను ఇక్కడికి వచ్చాను. క్షమించండి, నేను వస్తాను!" అంటూ బయటకు నడిచింది ఆ అమ్మాయి.

ఆ అమ్మాయి చర్యకు ఆశ్చర్యపోయిన కిశోర్ క్షణంపాటు దిమ్మెరపోయినా మరో క్షణంలో తేరుకున్నాడు.

"హలో!" అని పిలిచాడు.

ఆ అమ్మాయి ఆగింది. వెనక్కి తిరిగింది.

కిశోర్ ఆ అమ్మాయి దగ్గరకు వెళ్లాడు.


"అలా ఆ చెట్టు కింద నిలబడి మాట్లాడుకుందాం!" అని చెప్పి, చెట్టు దగ్గరకు నడిచాడు.

ఆ అమ్మాయి కిశోర్ వెనుకే నడిచి ఆ చెట్టు దగ్గరకు చేరుతుంది.

"చూడండి, మిస్ ..." అంటున్న కిషోర్‌తో -

"కల్పన" తన పేరు గుర్తు చేసింది ఆ అమ్మాయి.

"చూడండి, మిస్ కల్పనా! మీ ధైర్యాన్ని చొరవని



నేను మెచ్చుకుంటున్నాను. అంతమాత్రాన మీరు నాకు నచ్చారని అర్థం కాదు. మగవారికి మనసే లేదని చెప్పారు. అలా మగవారి గురించి మీరు వేసుకున్న అంచనా తప్పు. చాలామంది మగవారి మనసు బాధపడటానికి కారణం మీ ఆడవాళ్ళే. మొన్నటికి మొన్న నా ఫ్రెండ్ ఒకడు మోసపోయాడు. అతన్ని ప్రేమించానని చెప్పిన ఆ అమ్మాయి ఇంకొకడిని పెళ్లి చేసుకుని హాయిగా కాపురం చేస్తోంది. నా ఫ్రెండ్ పెళ్లి చేసుకోనని చెబుతున్నాడు!" చెప్పాడు కిషోర్.

"నే నడిగే ప్రశ్నకి, మీ రిచ్చే సమాధానానికి సంబంధం లే దనుకుంటున్నాను" అన్నది కల్పన.

"ఉంది! అందుకనే చెప్పాను. మీతో చెప్పకూడదనే అనుకున్నాను. కానీ, మీరు ధైర్యంగా నన్ను అడగటంతో చెబుతున్నాను.'

"మీలో ఏదీ తక్కువ లేదు. అందం, చదువు, ధైర్యం - అన్నీ ఉన్నాయి. మొదటి చూపులోనే మీరు నాకు నచ్చారు. అందుకే వెంటనే మీరు నాకు నచ్చారని మా నాన్నకు చెప్పాను.

"మిమ్మల్ని చేసుకుంటున్నా నని నా స్నేహితులతో చెప్పాను. నా స్నేహితులు నన్ను పార్టీ అడిగారు. జీతం తీసుకున్న తరువాత ఇస్తా నని చెప్పాను. జీతం తీసుకున్నాను, వాళ్లందరినీ హోటల్‌కు తీసుకెళ్లి స్వీటు, హాటుతో పార్టీ ఇచ్చి, వాళ్లని 'పెళ్లి పుస్తకం' సినిమాకు తీసుకువెళ్లాను. అక్కడ మిమ్మల్ని చూశాను. ఒంటరిగా కాదు - ఇంకొక మగవాడితో. ఎవరై ఉంటారా అని ఆలోచించాను. మీ రిద్దరూ నవ్వుకుంటూ, ఒకరికొకరు రాసుకుంటూ మాట్లాడుకోవడం చూసిన నాకు మీ ఇద్దరూ ఎవరై ఉంటారనే సందేహం తీరిపోయింది. పెళ్లి చూపుల తరువాత గూడా ప్రేమించినవాడితో తిరగటం, సినిమాలకు రావటం, ప్చ్! భగవంతుడు నాకు అవమానం జరగకుండా చూశాడు. నిన్ను చూసిన వెంటనే మా ఫ్రెండ్స్‌కి పరిచయం చేద్దాం అనుకున్నాను. పరిచయం చేసుంటే ... మై గాడ్!" చెప్పటం ఆపాడు కిశోర్.

కల్పన తల వంచుకుని మౌనంగా నిలబడింది.

"చూడండి, కల్పనగారూ! మీరు బలవంతం చేశారు



ఏది బంగారం?

ఒక రైతు ఒక ఎరువుల కంపెనీపై వినియోగదారుల ఫోరంలో కేసు వేయటానికి ఒక లాయరు దగ్గరకు వెళ్లాడు.

కేసు వేయటానికి గల ప్రధాన కారణ మేమిటని ఆ రైతుని లాయరు ప్రశ్నించాడు.

'ఈ ఎరువుల కంపెనీ వారి ఎరువులు వాడితే పొలంలో 'బంగారం' పండుతుందన్నారు. కానీ నా పొలంలో 'బంగారం' పండలేదు. అందుకే ఫోరంలో కేసు వేయదలిచాను.'

రైతు సమాధానం వినగానే కళ్లు తిరిగిపడ్డాడు లాయరు.

విశ్వతేజ [చంద్రవరం]

కాబట్టి మీరు మొదట్లో నాకు నచ్చడానికి తరువాత నచ్చకపోవడానికి కారణం చెప్పాను. లేకపోతే, చెప్పేవాడిని కాదు. ఐ యామ్ సారీ! మిమ్మల్ని నొప్పించటం నా ఉద్దేశం కాదు."

కిశోర్ చెప్తుంటే కల్పన కిలకిలా నవ్వింది.

ఆమె నవ్వు ఆపుకోటానికి రెండు క్షణాలు పట్టింది.

"అనుమానం ఆడవాళ్ల లక్షణం అంటారు. కాదు మగవారికి కూడా అనుమానం ఒక లక్షణం అనటానికి నిదర్శన మిచ్చారు మీరు. అనుమానం రావటంలో తప్పు లేదు. కానీ అది తీర్చుకోకపోవడమే తప్పు. ఆ రోజు మీరు సినిమా హాలులో నాతోపాటు చూసింది మా అన్నయ్యని. అతను మా పెద్దమ్మ కొడుకు. బొంబాయిలో ఉంటాడు. చిన్నప్పుడు మే మంతా కలిసి ఉండేవాళ్లం. ఉద్యోగరీత్యా అత నిప్పుడు బొంబాయిలో ఉంటున్నాడు. అక్కా, చెల్లెళ్లు లేని అతనికి నే నంటే ప్రాణం. అనుకోకుండా ఆఫీసు పని మీద హైదరాబాదు వచ్చాడు. పెళ్లి కొడుకుకి నేను నచ్చానని చెప్పాను. మిమ్మల్ని చూడాలనుకున్నాడు. కానీ ఆరోజే తిరిగి బొంబాయి వెళ్లాలన్న ప్రోగ్రాం అతన్ని మిమ్మల్ని కలవనీయలేదు. పెళ్లికొడుకుకు నచ్చినందుకు పార్టీ ఇమ్మన్నాడు. సినిమాకు బయలుదేరాం." చెప్పేసి, వెనక్కి తిరిగింది కల్పన.

తన్ను తాను తిట్టుకున్నాడు కిశోర్.

"హలో!" అని పిలిచాడు.

కల్పన ఆగింది.

"సారీ! వెరీ వెరీ సారీ! క్షమించండి!" చెప్పాడు కిశోర్.

కల్పన నవ్వింది.

"టీ, తాగుదాం రండి!" ఆహ్వానించాడు కిశోర్

"ఒక కండిషన్!" అన్నది కల్పన.

"చెప్పండి!" అన్నాడు కిశోర్.

"ఇం కెప్పుడు మీకు అనుమానమొచ్చినా నన్ను అడిగి తీర్చుకోవాలి!"

"ఓకే! ఓకే! ఈసారికి క్షమించండి!"

"కథ సుఖాంతం అయినప్పుడు ఎవరూ ఎవరినీ క్షమించవలసి ఉండదు! కార్యేషు దాసీ, కరణేషు మంత్రీ ... అన్న శ్లోకం? అవసరమైన సమయాలలో భర్తకు తగు సలహాలిచ్చి, జీవిత నౌకను సాఫీగా గమ్యం వైపు పయనించేందుకు సహకరించడం ధర్మపత్ని లక్షణాలలో ఒకటే, ముఖ్యమైనది కూడాను. అదే నేను నెరవేర్చింది. కాకపోతే కాబోయే కులపత్నిగా ముందే నిర్వహించాను! అంతే!"

## రాజశేఖర్ హుండీ

**యాంగ్రీ** యంగ్‌మన్ హీరో డాక్టర్ రాజశేఖర్ ఇంట్లో ఒక హుండీ ఉంటుంది. తాను సంపాదిస్తున్న దానిలో ఎంతో కొంత - వీలైతే రోజూగాని, లేకుంటే ఎప్పుడు వీలు చిక్కితే అప్పుడుకాని డబ్బు ఆ హుండీలో వేస్తుంటాడు. భార్య జీవిత కూడా అలాగే చేస్తూంటుంది. ఎవరైనా గిఫ్టులు ఇచ్చినా, కానుకలు అందించినా వాటన్నింటినీ విడిగా ఉంచి ఇంట్లో పనిచేసే వాళ్లకు ఇస్తుంటారు రాజశేఖర్ దంపతులు. హుండీలో జమచేసిన డబ్బును కూడా ఏడాది కోసారో, పండగ పబ్బాలప్పుడో తీసి పని వారికి పంచిపెడుతుంటారు.

భగవత్కృప వల్ల ఏ లోటూ లేకుండా జీవితం గడపడానికి వీలైన ఆదాయం ఉంది. దానిలో కొంత ఇతరులకు చెందేట్లు చెయ్యడం రాజశేఖర్ అభిమతం. కష్టపడకుండా వచ్చిన కానుకల్ని కూడా తాము అనుభవించడం కన్నా ఇతరులకు అందజేయడంలోనే మాకు తృప్తి ఉందంటారు రాజశేఖర్ దంపతులు.

ఇంట్లో హుండీ పద్ధతి, తాను చిత్రపరిశ్రమలో ప్రవేశించి హీరోగా సంపాదిస్తున్నప్పటి నుంచీ అనుసరిస్తున్నా నంటాడు రాజశేఖర్. హుండీలో చేరిన మొత్తం తీసి చూసినప్పుడు ఒక్కొక్కప్పుడు పదివేల దాకాను, అంతకుమించీ ఉన్న సందర్భా లున్నాయట!

రవి

